## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

సిర్గాపూర్, నవంబర్ 29 : మండలం పరిధిలోని 30 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు ఎన్నికల నిర్వహణ కోసం, సిబ్బంది బస చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన సిబ్బంది బూత్‌లో ఎన్నికల సామగ్రికి అవసరయ్యో టేబుళ్లు, బల్లలు, ఏర్పాట్లను సరి చూసుకొని సర్వసిద్ధం చేశారు. మండలంలో మొత్తం మూడు రూట్లలో సెక్టార్ అధికారులు పర్యవేక్షిస్తారని తహసీల్దార్ ఉమాశంకర్ తెలిపారు.


పోలింగ్ బూత్‌లో సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

## కంగ్టి మండలంలో

కంగ్టి, నవంబర్ 29 : కంగ్టి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం వరకు చేరుకున్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ విష్ణుసాగర్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 34,479 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 34 గ్రామ పంచాయతీలకు గాను 43పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓటరు జాబితాలో పేరు వచ్చిన ప్రతి ఒక్కరూ ఓటరు స్లిప్పుతో పాటు 12రకాల్లో ఏదైనా ఒక గుర్తింపు పత్రంతో పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గురువారం సాయంత్రం వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.


కంగ్టి పోలింగ్‌కేంద్రం వద్ద ఈవీఎంలతో చేరుకున్న ఎన్నికల సిబ్బంది


నాగల్‌గిద్ద : గూడూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు



చౌటకూర్ : పోలింగ్ నిర్వహణకు సిబ్బందిని కేటాయిస్తున్న రిటర్నింగ్ అధికారి పాండు


సిర్గాపూర్ : పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు


పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న సిబ్బంది



నారాయణఖేడ్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం

# నారాయణఖేడ్‌లో 296 కేంద్రాలు

- నారాయణఖేడ్‌లో పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ శరత్
- ప్రశాంత ఎన్నికల కోసం భారీ బందోబస్తు

నారాయణఖేడ్, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నిర్వహించనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలోని 296పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేసిన పీవోలు, ఏపీవోలు, సిబ్బంది ఈవీఎంలతో బుధవారం పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఇందుకోసం పట్టణ సమీపంలోని జూకల్ శివారులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ శరత్ సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ సజావుగా జరిగే విధంగా పోలింగ్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డికి సూచించారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,31,188మంది ఓటర్లు ఉండగా 1,14,599 మంది పురుషులు, 1,16,581మంది మహిళలు ఉన్నారు. కాగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలను ఆదర్శ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్, వీడియో చిత్రీకరణ తదితర ఏర్పాట్లు చేశారు. కాగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే దిశగా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. మొత్తం 500ల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా నారాయణఖేడ్ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని 50 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.


నారాయణఖేడ్‌లో పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ శరత్

# అందోలులో 313 పోలింగ్ కేంద్రాలు

## 1,417 మంది పీవోలు, ఏపీవోలు, ఓపీలు కేటాయింపు


పోలింగ్ కేంద్రాల వివరాలను సరిచూసుకుంటున్న సిబ్బంది

చౌటకూర్, నవంబరు 29 : పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని 313 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం పోలింగ్ నిర్వహణ బాధ్యతలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు సిబ్బందికి అప్పగించారు. మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నియోజకవర్గంలోని 313 పోలిం గ్ కేంద్రాలను 35 రూట్లుగా విభజించారు. ఒక్కో రూట్‌లో ఐదు పోలింగ్ కేంద్రాలకు తగ్గకుండా వాహనాలు, పోలింగ్, పోలీసు సిబ్బందిని కేటాయించారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలతో కలిపి మొత్తం 1,417మంది సిబ్బంది ఉన్నారు. అనంతరం పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పోలీసు బందోబస్తు మధ్య తరలివెళ్లారు. ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు దీపక్ సింగ్లా, అదనపు కలెక్టర్ మాధురి సందర్శించారు.

**పోలింగ్ కేంద్రాలకు గుంపులుగా రావొద్దు**

పోలింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బాలాజీనాయక్ హెచ్చరించారు. గురువారం పోలింగ్ జరుగతున్న దృష్ట్యా చౌటకూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బందితో ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. చౌటకూర్, కోర్పోలు, శివంపేట సమస్యాత్మకంగా గుర్తించామని పేర్కొన్నారు. పోలింగ్ నేపథ్యంలో 144సెక్షన్ అమలులో ఉన్నదన్నారు. గ్రామాల్లో ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఆయా రాజకీయ పార్టీల నాయకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడ కూడా గుంపులు, గుంపులగా తిరుగవద్దని, పోలింగ్ కేంద్రాలకు కూడా గుంపులుగా రావొద్దని సూచించారు. సాయంత్రం వరకు కఠిన నిబంధనలు అమలులో ఉంటాయని డీఎస్పీ బాలాజీనాయక్ తెలిపారు.


చౌటకూర్ : పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది


ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది